సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 16 । అక్టోబర్ । 2025



టన్ను చీనీ రూ.14 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.14 వేలు, కనిష్టంగా రూ.6 వేల ప్రకారం ధర పలికాయి.



టమాట.. నష్టాల బాట

భారీగా పతనమైన టమాట ధరలు రైతులను నష్టాల్లోకి నెట్టాయి. కిలో రూ.15లోపే పలుతుడుంటతో పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి నెలకొంది.

10లో

గరిష్టం/కనిష్టం
34.2°/20.4°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జిల్లాలో మోస్తరు వర్షం

- మరో రెండు రోజులూ జిల్లాకు వర్ష సూచన



పుట్టపర్తి అర్బన్: ఉపరితల ద్రోణి ప్రభావంతో బుధవారం జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. 9 మండలాల పరిధిలో 49.2 మి.మీ వర్షపాతం నమోదైంది. బుక్కపట్నం మండలంలో 16.4 మి.మీ, కొత్తచెరువు మండలంలో 11.6 మి.మీ, అమడగూరు 5.4, పుట్టపర్తి 4.6, సోమందేపల్లి 3.4, ఓడీచెరువు 2.4, నల్లచెరువు 2.2, తనకల్లు 2, పెనుకొండ మండలంలో 1.2 మి.మీ చొప్పున వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తుపాను ప్రభావంతో మరో రెండు రోజులూ జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించారు.

పారిశ్రామిక వాడల అభివృద్ధికి ప్రాధాన్యం



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్

ప్రశాంతి నిలయం: జిల్లాలో పారిశ్రామిక వాడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ శ్యాం ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఏపీఐఐసీ రూపొందించిన 'ఇండస్ట్రీస్ పార్ట్నర్‌షిప్ డ్రైవ్' పోస్టర్లను అధికారులతో కలిసి విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని పారిశ్రామిక వాడల్లో నెల రోజుల పాటు డ్రైవ్‌ను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పారిశ్రామిక వాడల్లో పారిశుధ్యం, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే కొత్త పెట్టుబడులు, ఉద్యోగ కల్పనపై పారిశ్రామిక వేత్తలతో సదస్సులు నిర్వహించడం... ప్రస్తుతమున్న పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాల అధునికీకరణపై శ్రద్ధ తీసుకోవాలని ఏపీఐఐసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి రేపు మడకశిరకు రాక

మడకశిర: కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న శుక్రవారం మడకశిరలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా మధ్యాహ్నం 1 గంటకు మడకశిర వద్ద రాయదుర్గం–తుమకూరు రైల్వేలైన్ పనుల పురోగతిని పరిశీలించనున్నట్లు రైల్వే వర్గాలు వెల్లడించాయి. అలాగే పావగడ నియోజకవర్గంలోనూ రైల్వే లైన్ పనుల పురోగతిని పరిశీలించనున్నట్లు సమాచారం.

ప్రజల ప్రాణాలు పట్టవా బాబూ

- 'ఎస్' బ్రాండ్ మద్యంతో ఇంకెంతమందిని చంపుతారు
- ఊరూరా విచ్చలవిడిగా బెల్టు షాపులు, గంజాయి
- గుడి, బడి తేడా లేకుండా జూద కేంద్రాలు
- ప్రపంచ ప్రసిద్ధి చెందిన పుట్టపర్తిని నాశనం చేస్తున్నారు
- మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తీరు మార్చుకోవాలి
- పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ధ్వజం
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఎక్సైజ్ కార్యాలయం ముట్టడి



ఎక్సైజ్ అధికారి గోవింద్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి.



పుట్టపర్తి ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకులు

సాక్షి, పుట్టపర్తి: ''కూటమి నాయకుల జేబులు నిండితే చాలా... ప్రజల ప్రాణాలు పోయినా పట్టవా చంద్రబాబూ... నకిలీ మద్యంతో ఇంకెన్ని కుటుంబాలు వీధినపడాలి. ఊరూరా బెల్టుషాపులు ఏర్పాటు చేసి నకిలీ మద్యంతో పేదల ప్రాణాలు తీస్తున్నారు. చివరకు ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి పరువు మంటగలుపుతున్నారు..మీ ధన దాహానికి అంతేలేదా'' అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పుట్టపర్తి నియోజకవర్గ సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ల ముట్టడి కార్యక్రమంలో భాగంగా బుధవారం దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో స్థానిక జిల్లా ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. 'నకిలీ మద్యం వద్దు బాబు.. నారా – సారా.. ఎస్ బ్రాండ్ మందు తేవొద్దు.. ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు' అనే నినాదాలతో ఎక్సైజ్ కార్యాలయ ప్రాంగణం దద్దరిల్లింది. 'సీఎం డౌన్ డౌన్' అంటూ ప్రజలు నినాదాలు చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్‌కు అందజేశారు.

పుట్టపర్తి పరువు తీస్తున్నారు..

కూటమి నాయకులు అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన పుట్టపర్తిని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చారని దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. పుట్టపర్తిలో వ్యభిచార, జూద కేంద్రాలతో పాటు మద్యం, గంజాయి విచ్చలవిడిగా విక్రయిస్తూ భగవాన్ శ్రీసత్యసాయి బాబా ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నకిలీ మద్యం ఏరులై పారుతోందన్నారు. స్థానికంగా కొందరు కూటమి నేతలు నకిలీ దందాకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. నియోజవకర్గంలో ఇంత జరుగుతున్నా.. టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. నిత్యం తాను విద్యావంతుడినని చెప్పుకునే 'పల్లె' సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. పుట్టపర్తిలో ఏ వీధిన చూసినా మద్యం ఏరులై పారుతోందని, చీకటి పడితే గంజాయి పీలుస్తూ యువత జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. ఇతర ప్రాంతాల నుంచి రప్పించి వ్యభిచార, జూద కేంద్రాలు నిర్వహిస్తూ.. ఆధ్యాత్మిక కేంద్రం పరువు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా ఎదగడానికి.. డబ్బులు సంపాదించడానికి కాంట్రాక్టు పనులు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ఉన్నాయని, మరీ ఇంతలా దిగజారి వ్యవహరించడం సరికాదని హితవు పలికారు.

అంతటా నకిలీ మద్యమే..

శ్రీసత్యసాయి నడియాడిన ప్రదేశంలో ఏనాడూ మద్యం అమ్మకాలు లేవని దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మద్యం దుకాణాలను జనావాస ప్రాంతాల్లోకి తెచ్చారన్నారు. బాబా మందిరం చుట్టూ బెల్టు షాపులు వెలిశాయని.. డోర్ డెలివరీ చేసే స్థాయికి పాలకులు భ్రష్టు పట్టించారని ధ్వజమెత్తారు. మద్యం అమ్మకాలు పక్కన పెడితే.. ఖాళీ సీసాలను తీసుకుని.. తిరిగి అందులో కల్తీ మందు నింపి.. బెల్టు షాపుల ద్వారా చీప్ లిక్కర్ రూపంలో యథేచ్ఛగా విక్రయాలు చేస్తున్నారని పేర్కొన్నారు. నకిలీ మద్యం వ్యవహారంలో ఎవరి ప్రమేయం ఉన్నా కఠినంగా శిక్షించాలని కోరారు.

నాడు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు..

పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లాను తీసుకొచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీదే అని దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. అంతేకాకుండా ఎన్‌హెచ్–342 పనులు, 193 చెరువులను నింపే విధంగా కాలువలు తవ్వడం తదితర అభివృద్ధి పనులను నియోజకవర్గానికి తీసుకొచ్చామని గుర్తు చేశారు. అయితే నేడు కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు మరచి.. అసాంఘిక కార్యక్రమాలు నడిపిస్తుంటే బాధాకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశప్ప, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, జిల్లా వ్యవసాయ సలహామండలి మాజీ చైర్మన్ అవుటాల రమణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఫాటోసాయి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదర్‌రెడ్డి, నల్లమాడ ఎంపీపీ సనితాబాయ్, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేశాయిరెడ్డి భారతి, కార్యదర్శి పి.సాయిలీలారెడ్డి, మహిళా విభాగం నేతలు ప్రభావతమ్మ, భారతి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజునాయుడు, నియోజవర్గ నాయకులు ఆసాది గంగిశెట్టి, ధర్మతేజారెడ్డి, పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, నల్లమాడ, ఓడీచెరువు, అమడుగూరు మండల కన్వీనర్లు రవినాయక్, ఈశ్వరయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, కేశప్ప, ఆదినారాయణరెడ్డి, లక్ష్మిరెడ్డి, జయప్ప, కౌన్సిలర్లు చెరువు భాస్కర్‌రెడ్డి, పవన్‌కుమార్, మాజీ కౌన్సిలర్లు నారాయణరెడ్డి, ఈశ్వరప్ప, రాంజీనాయక్ , గోవర్ధన్‌రెడ్డి, నరసారెడ్డి, మాధవరెడ్డి, శేషూరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగమణిపై తదుపరి చర్యలొద్దు

- పోలీసులకు హైకోర్టు ఆదేశం



నోటీసులు అందుకుని బయటకు వచ్చిన నాగమణి, లీగల్ సెల్ విభాగం నేతలు

చిలమత్తూరు: టీడీపీ నేతలు అక్రమ కేసులతో మానసిక వేధింపులకు గురైన వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణికి హైకోర్టు ఊరట కల్పించింది. ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది.

బాలకృష్ణ వ్యాఖ్యలు ఖండించినందుకు కేసు..

వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీలో చేసిన అనుచిత వ్యాఖ్యలను వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణి ఖండించారు. దేవాలయం లాంటి అసెంబ్లీలో స్థాయికి తగ్గట్టు నడుచుకోవాలని హితవు పలికారు. దీనిపై కొందరు టీడీపీ మహిళా నాయకురాళ్లు నాగమణిపై హిందూపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సెప్టెంబర్ 27వ తేదీన ఫిర్యాదు చేయగా... పోలీసులు కనీసం విచారించకుండానే కేసు నమోదు చేశారు. ఈ కేసులో పోలీసులు తదుపరి చర్యలు తీసుకోకుండా ఆదేశించాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ గౌరవాధ్యక్షుడు, న్యాయవాది జిల్లా సుదర్శన్‌రెడ్డి హైకోర్టులో స్క్వాష్ పిటిషన్ వేశారు. విచారించిన న్యాయస్థానం నాగమణిపై తదుపరి చర్యలను నిలిపివేస్తూ పోలీసులను ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో బుధవారం హిందూపురంలోని ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాదులు ఇందాద్, వేణుగోపాల్, అతిక్‌లు హైకోర్టు ఉత్తర్వుల కాపీని సీఐ రాజగోపాల్ నాయుడుకు అందించారు. దీంతో సీఐ మహిళా నేత నాగమణికి బీఎన్‌ఎ–35 కింద నోటీసులు అందించారు. అనంతరం నాగమణి మీడియాతో మాట్లాడారు. తనపై అక్రమ కేసు నమోదు కాగా, వైఎస్సార్ సీపీ పెద్దలు అండగా నిలిచి ధైర్యం చెప్పారన్నారు. కోర్టు కూడా ఈ అక్రమ కేసుపై తగిన విధంగా స్పందించిందన్నారు. త్వరలోనే కేసు కూడా వీగిపోతుందన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు.

కలంపై కూటమి కక్ష

- హైదరాబాద్‌లోని 'సాక్షి' కార్యాలయంలో సోదాలు
- నోటీసులిచ్చే పేరుతో గంటల తరబడి హంగామా
- కూటమి సర్కార్ తీరుపై మేధావుల మండిపాటు

సాక్షి, పుట్టపర్తి



నిజాలను నిర్భయంగా రాస్తున్న పత్రికలపై, విలేకరులపై కూటమి సర్కార్ కక్ష గట్టింది. అక్రమ కేసులతో వేధిస్తోంది. పత్రికా కార్యాలయాల్లో సోదాలు, సంపాదకుల ఇళ్లలో తనిఖీల పేరుతో పత్రికా స్వేచ్ఛను హరిస్తోంది. అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది. బుధవారం హైదరాబాద్‌లోని 'సాక్షి' ప్రధాన కార్యాలయానికి వెళ్లిన నెల్లూరు పోలీసులు సోదాల పేరుతో వెళ్లి.. గంటల తరబడి తిష్టవేసి జర్నలిస్టులను భయపెట్టాలని చూశారు. ఈ చర్యలను మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నేతలు తప్పుపడుతున్నారు. రాజ్యాంగానికి నాల్గో స్తంభంగా నిలిచిన పత్రికలకు సంకెళ్లు వేసే కుట్రలను ప్రభుత్వం మానుకోవాలని హితవు పలుకుతున్నారు. జర్నలిస్టులపై కేసులు నమోదు చేసినా.. బెదిరించే విధంగా మెసేజీలు పంపినా.. ఇళ్లలో చొరబడి సోదాలు చేసినా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. పాత్రికేయులకు స్వేచ్ఛ లేకుంటే.. ప్రజాస్వామ్యం ఖూనీ కావడం ఖాయమని అభిప్రాయపడ్డారు.

రాష్ట్రంలో నిరంకుశ పాలన



రాష్ట్రంలో నిరంకుశ పాలన నడుస్తోంది. ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరిన వారిపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారు. చివరకు ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన పత్రికలపైనా పోలీసులను ప్రయోగిస్తున్నారు. హైదరాబాద్‌లోని 'సాక్షి' కార్యాలయంలో నెల్లూరు పోలీసులు మితిమీరి ప్రవర్తించారు. జర్నలిస్టులను భయపెట్టి గుప్పిట్లో పెట్టుకోవాలనే కూటమి ప్రభుత్వం అక్రమ కేసులతో వేధిస్తోంది. ప్రజాస్వామ్యవాదులంతా ఈ చర్యలను ఖండించాలి.

– ఉషశ్రీ చరణ్, జిల్లా అధ్యక్షురాలు, వైఎస్సార్ సీపీ

ప్రమాదంలో పత్రికా స్వేచ్ఛ



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు దీరినప్పటి నుంచి పత్రికా స్వేచ్ఛ ప్రమాదంలో పడింది. తమ అవినీతిని, అరాచకాలను, దౌర్జన్యాలను వెలుగులోకి తెస్తున్నారని కూటమి నేతలు 'సాక్షి'పై కక్షగట్టారు. నోటీసులు పేరుతో వేధిస్తున్నారు. ఇది ముమ్మాటికీ పత్రికా స్వేచ్ఛను హరించడమే. సాక్షి ఎడిటర్‌కు నోటీసులు అందించే పేరుతో నెల్లూరు పోలీసులు వ్యవహరించిన తీరు అప్రజాస్వామికంగా ఉంది. ప్రభుత్వాల తీరు మారాలి.

– శంకర నారాయణ, మెంబర్, వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ

నిజాలు రాస్తే కక్ష గడతారా?



నిజాలు ప్రజల ముందుంచే పత్రికలపై కేసులు పెట్టి వేధించడం ఆక్షేపనీయం. ఇది ముమ్మాటికీ కక్ష సాధింపే. ఎడిటర్‌కు నోటీసులిస్తామని హైదరాబాదులోని 'సాక్షి' ప్రధాన కార్యాలయానికి వెళ్లిన నెల్లూరు పోలీసులు హల్‌చల్ చేశారు. గంటల తరబడి కార్యాలయంలో తిష్టవేసి జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేశారు. ఇలాంటివి ఉపేక్షించబోం. పత్రికలపైనా, విలేకరులపైనా పెత్తనం చేయాలని చూస్తే ఊరుకోం. ప్రజాస్వామ్యవాదులతో కలిసి ఉద్యమాలకు శ్రీకారం చుడతాం.

– రామాంజనేయులు, అధ్యక్షుడు, హిందూపురం ప్రెస్‌క్లబ్

నకిలీ మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారు



- ప్రతి మూడింటిలో ఒక బాటిల్ నకిలీ మద్యమే
- పోలీసులను అడ్డుపెట్టుకుని చంద్రబాబు అక్రమ కేసులు పెట్టిస్తున్నారు
- నకిలీ మద్యం కేసులో సీబీఐ విచారణ జరపాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ డిమాండ్

అనంతపురం: నకిలీ మద్యం తయారీని ఒక పరిశ్రమలా మార్చి, కూటమి పెద్దల కనుసన్నల్లో రాష్ట్రమంతా పారించి అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ అన్నారు. అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని రంగాలు కల్తీమయం అయ్యాయన్నారు. కల్తీ మద్యం వ్యవహారంలో ఫేక్ వీడియో, పక్షపాత దర్యాప్తు చేసినట్లు స్పష్టమవుతోందన్నారు. చంద్రబాబు పసలేని ప్రెస్‌మీట్లు పెడుతూ, తప్పుడు వార్తలు రాయిస్తూ, దొంగ డిబేట్లు పెట్టిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. కల్తీ మద్యమే కాకుండా.. విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు..ఇలా అన్నీ కల్తీ చేస్తున్నారని, చివరకు చంద్రబాబు, ఆయన పార్టీ కూడా కల్తీనే అని దుయ్యబట్టారు. నకిలీ మద్యం కేసులో సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వేసిన సిట్‌పైన ఎవరికీ నమ్మకం లేదన్నారు. పైగా నకిలీ మద్యం మకిలిని వైఎస్సార్‌సీపీకి అంటగట్టే ప్రయత్నం చేయడం దారుణమైన విషయమన్నారు. ప్రతి పల్లెలో నాలుగైదు బెల్టుషాపులు ఉన్నాయని, చంద్రబాబు ఆధ్వర్యంలోనే నకిలీ మద్యం తయారీ ప్లాంట్లు ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఇందులో తయారైన మద్యం అన్ని షాపుల్లోకి చేరిందన్నారు. ప్రతి మూడు మద్యం బాటిళ్లలో ఒకటి నకిలీ బాటిలే అన్నారు.

పోలీసు ఆఫీసర్లే వీడియో రికార్డు చేయించారు

'నకిలీ మద్యం వ్యవహారంలో పోలీసు వ్యవస్థ ఒక వ్యక్తిని అరెస్ట్ చేసింది. అరెస్ట్ చేసిన వెంటనే అతని వద్ద ఉన్న వస్తువులన్నింటినీ స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తారు. కానీ స్వయంగా పోలీసు ఆఫీసర్లే కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉండేలా అతనితో మాజీ మంత్రి జోగి రమేష్‌పై ఆరోపణలు చేయించారు. ఇది చాలా దుర్మార్గమైన చర్య' అని గోరంట్ల మాధవ్ అన్నారు. అధికారులు చంద్రబాబు ఉచ్చులో పడొద్దన్నారు. చంద్రబాబు అక్రమంగా సంపాదిస్తూ వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారని, బీజేపీ. పవన్‌కల్యాణ్ గుర్తెరగాలని సూచించారు.

క్లుప్తంగా

ఉచితం మోయలేక మొరాయింపు



ధర్మవరం రైల్వే స్టేషన్ వద్ద ఆగిపోయిన బస్సు

ధర్మవరం రూరల్: స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ భారీగా పెరిగింది. ఇందుకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెరగకపోవడంతో ప్రతి బస్సూ కిటకిటలాడుతోంది. ఒక బస్సులో 49 మందికి పరిమితి ఉంటే 100 నుంచి 120 మంది వరకు ప్రయాణిస్తున్నారు. దీంతో బస్సులు ఎక్కడికక్కడ మొరాయిస్తున్నాయి. తాజాగా బుధవారం అనంతపురం నుంచి చిగిచెర్ల మీదుగా అధిక సంఖ్యలో ప్రయాణికులతో పుట్టపర్తికి బయలుదేరిన బస్సు ధర్మవరం రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే ముందుకు కదలలేనంటూ మొరాయించింది. దీంతో ప్రయాణికులు ఆటోలలో గమ్య స్థానాలకు వెళ్లాల్సి వచ్చింది.

బొలెరోపై దూసుకెళ్లిన కంటైనర్

తనకల్లు: బొలెరో వాహనంపై కంటైనర్ దూసుకెళ్లడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు... తనకల్లు మండలం దండువారిపల్లికి చెందిన రెడ్డిశేఖర్‌రెడ్డి, మహదేవ్ బుధవారం టమాట పంటను బొలెరో వాహనంలో లోడు చేసుకుని అన్నమయ్య జిల్లా మొలకలచెరువుకు బయలుదేరారు. సీజీ ప్రాజెక్టు వద్దకు చేరుకోగానే టైర్లలో గాలి కొట్టించేందుకు రోడ్డు పక్కన ఉన్న పంక్చర్ షాపు వద్ద ఆపారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కంటైనర్... బొలెరో మీదుగా దూసుకెళ్లింది. ఘటనలో బొలెరో నుజ్జునుజ్జయింది. రెడ్డిశేఖర్‌రెడ్డి, మహదేవ్ తీవ్ర గాయాలతో క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయారు. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు అశోక్, శ్రీనాథ్, తండేల్, నవీన్, మణి, స్థానికులు అక్కడకు చేరుకుని క్రేన్, జేసీబీ సాయంతో క్షతగాత్రులను వెలికి తీశారు. అనంతరం తమ ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రులను ఆస్పత్రికి వందేమాతరం టీం సభ్యులు తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కదిరికి తీసుకెళ్లారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి



మృతుడు సిద్ధప్ప

రొళ్ల: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు తెలిపిన మేరకు.. మడకశిర మండలం గోవిందాపురంగొల్లహట్టి గ్రామానికి చెందిన సిద్ధప్ప (48) దేవరాజు బుధవారం ఉదయం రొళ్లకు వచ్చారు. పని ముగించుకున్న అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. కొడగార్లగుట్ట క్రాస్ వద్దకు చేరుకోగానే జీడీ పాళ్యం గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం నుంచి ద్విచక్ర వాహనంపై రొళ్లగొల్లహట్టి చెందిన వెంకటేష్ జాతీయ రహదారి పైకి చేరుకున్నాడు. అప్పటికే అతి సమీపంలోకి చేరుకోవడంతో వాహనాన్ని తప్పించే క్రమంలో వెంకటేష్ బైక్‌ను ఢీకొని ముగ్గురూ కిందపడ్డారు. తలకు బలమైన గాయం కావడంతో సిద్ధప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన దేవరాజు, వెంకటేష్‌ను హైవే అంబులెన్స్ వాహనంలో మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

టమాట రైతు చిత్తవుతున్నాడు. ధరలు నేలచూపు చూస్తుండటంతో నష్టాల బాట పడుతున్నాడు. గత నెలన్నర రోజులుగా మార్కెట్ పరిస్థితి దారుణంగా ఉండటంతో కనీసం పెట్టుబడులు కూడా దక్కడం లేదని రైతులు వాపోతున్నారు.



ఆత్మకూరు సమీపంలో పశువులకు వదిలేసిన టమాట పంట

టమాట... నష్టాల బాట



నెలన్నర రోజులుగా రైతులకు దక్కని గిట్టుబాటు ధరలు

- కిలో రూ.15 లోపు పలుకుతుండటంతో దక్కని పెట్టుబడి
- ఉమ్మడి జిల్లాలో 19 వేల హెక్టార్ల భారీ విస్తీర్ణంలో టమాట సాగు
- 7 లక్షల టన్నుల దిగుబడితో అన్నమయ్య తర్వాత స్థానంలో 'అనంత'

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాలో 19 వేల హెక్టార్లలో రైతులు టమాట పండిస్తున్నారు. ఇందులో అనంతపురం జిల్లాలో 12 వేల హెక్టార్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 7 వేల హెక్టార్లు ఉన్నాయి. 7 లక్షల టన్నుల దిగుబడితో అన్నమయ్య తర్వాతి స్థానంలో అనంత జిల్లా ఉండడం గమనార్హం. ఎకరాకు 14 నుంచి 18 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. కట్టెలు, తీగలు కట్టిన టమాట పంటలో ఎకరాకు రూ.1.20 లక్షల వరకు పెట్టుబడి వస్తుండగా... మామూలు పద్ధతిలో ఎకరాకు రూ.60 వేల వరకు పెట్టుబడి అవుతోందని రైతులు చెబుతున్నారు. కిలో రూ.22 నుంచి రూ.25 పలికితే పెట్టుబడి పోయి కొంత వరకు మిగులుతుందని అంటున్నారు. ప్రస్తుత మార్కెట్ ధరలతో కూలీలు, రవాణా ఖర్చులు, మార్కెట్‌లో కమీషన్లకు కూడా రాబడి సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఆరంభంలో ఊరించి..

సీజన్ ఆరంభం జూన్, జూలై, ఆగస్టులో మార్కెట్‌లో టమాట ధరలు ఆశాజనకంగా ఉండటంతో సాగు విస్తీర్ణం పెరిగింది. అయితే సెప్టెంబర్, అక్టోబర్‌లో మార్కెట్ పరిస్థితి తారుమారు అయింది. ధర గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అనంతపురంలోని కక్కలపల్లి మార్కెట్‌లో 15 కిలోల బాక్సు ధర గరిష్టంగా రూ.270 ఉండగా కనిష్టం రూ.130 ప్రకారం పలుకుతోంది. సగటున రూ.200తో క్రయవిక్రయాలు సాగుతున్నాయి. గరిష్ట ధర కూడా నాణ్యమైన కొన్ని లాట్లకు మాత్రమే లభిస్తోంది. మిగతావన్నీ రూ.100 నుంచి రూ.200 మధ్య పలుకుతుండడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం రోజూ మార్కెట్‌కు 2 వేల నుంచి 3 వేల టన్నుల వరకు సరుకు వస్తోంది.

అంతటా ఇదే పరిస్థితి!

మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోవడంతో చాలా మంది రైతులు.. కూలీలు, రవాణా ఖర్చు మిగులుతుందనే ఉద్దేశంతో టమాట కోతలకు స్వస్తి పలికారు. దీంతో పొలాల్లోనే పంటను పశువులకు వదిలేశారు. ఇప్పటికే 60 శాతం పంట పూర్తి కాగా, మరో 40 శాతం మేర ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వర్షాలకు తడిసినవి, మచ్చ ఉన్న కాయలను కొనడానికి వ్యాపారులు ముందుకు రాకపోవడంతో రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. టమాట సాగులో అన్నమయ్య తర్వాత రెండో స్థానంలో 'అనంత' ఉండగా ఆ తర్వాత చిత్తూరు, శ్రీసత్యసాయి, కర్నూలు జిల్లాలు ఉన్నాయి. కాగా, అనంతపురం, చిత్తూరు, అన్నమయ్య, కర్నూలు జిల్లా పరిధిలోని టమాట మార్కెట్లలో ధరల పరిస్థితి కూడా ఇలాగే ఉందని రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రూప్‌కుమార్ తెలిపారు.



ఒక్క కిలో కూడా అమ్ముడుపోలేదు

ఈ ఏడాది 3 ఎకరాల్లో టమాట సాగు చేశా. 3 ఎకరాలకు రూ.2.70 లక్షల వరకు పెట్టుబడులు అయ్యాయి. తీరా పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవడంతో మచ్చలు, ఇతర తెగుళ్లు వ్యాపించి పరిస్థితి తారుమారయింది. ధరలు తగ్గుముఖం పట్టి మార్కెట్‌లో అమ్ముడుపోలేదు. చేసేదేమీ లేక తోటను పశువులకు వదిలేసి వేరే పంట సాగు కోసం ప్రయత్నిస్తున్నా. ఒక్క కిలో కూడా అమ్ముకోలేక పోయా.

– రైతు రుక్మాంగధరెడ్డి, బొమ్మగానిపల్లి, బ్రహ్మసముద్రం మండలం



ధరలు దారుణంగా ఉన్నాయి

ఎకరాకు రూ.50 వేల పెట్టుబడితో దశల వారీగా 10 ఎకరాల్లో టమాట సాగు చేశాను. ఇప్పటికే ఐదు ఎకరాల పంట పూర్తయింది. ధరలు చూస్తే దారుణంగా ఉన్నాయి. పెట్టుబడులు కూడా చేతికి అందడం లేదు. ఏడాది పొడవునా గిట్టుబాటు ధరలు స్థిరంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేదంటే 80 శాతం మంది టమాట రైతులకు నష్టాలే మిగులుతాయి.

– కందుల పుల్లారెడ్డి, రైతు, ఆత్మకూరు

ఆటోలో ప్రసవం.. శిశువు మృతి

తనకల్లు: పురిటినొప్పులతో ఆటోలో ఆస్పత్రికి బయల్దేరిన గర్భిణి మార్గమధ్యంలోనే ప్రసవించింది. అయితే శిశువు కొద్దిసేపటికే మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. గేమేనాయక్ తండాకు చెందిన శారద అనే గర్భిణికి బుధవారం రాత్రి పురిటి నొప్పులు వచ్చాయి. వెంటనే కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ వచ్చేలోపు ఆమెకు నొప్పులు అధికం కావడంతో ఆటోలో ఆస్పత్రికి బయల్దేరారు. మార్గమధ్యంలోనే ప్రసవించింది. అయితే శిశువు ప్రాణంతో లేదు. ఆ వెంటనే వచ్చిన 108 వాహనంలో తల్లిని తనకల్లు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఎమ్మెల్యే బాలయ్య పీఏకు నిరసన సెగ



నీటి సమస్యపై పీఏ వీరయ్యను ఘెరావ్ చేస్తున్న మహిళలు

చిలమత్తూరు: హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్యను చిలమత్తూరు బీసీ కాలనీలో మహిళలు ఘెరావ్ చేశారు. వివరాలు.. బుధవారం బీసీ కాలనీలో టీడీపీ నేతలు పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు వచ్చిన పీఏ వీరయ్యను స్థానిక మహిళలు చుట్టుముట్టి తాగునీళ్లు లేక ఇబ్బంది పడుతుంటే ఎవరూ పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. వర్షాకాలంలోనే ఈ పరిస్థితి ఉంటే ఇక ఎండకాలంలో చుక్క నీరు కూడా ఇవ్వరేమోనని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరవకొత్తపల్లి ఎస్సీ కాలనీలో డ్రైనేజీ నీరు ఇళ్లలోకి వస్తోందని, పాఠశాలలో వర్షపు నీరు నిలుస్తోందని స్థానికులు ప్రశ్నించారు. ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించడం లేదని మండిపడ్డారు. దీంతో స్థానిక నాయకులు కల్పించుకుని సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామని భరోసానివ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

హుండీ ధ్వంసం.. నగదు అపహరణ



హుండీని పగులగొట్టిన దృశ్యం

ముదిగుబ్బ: మండలంలోని మర్తాడులో వెలసిన నేలకోటమ్మ దేవాలయంలో మంగళవారం అర్ధ రాత్రి దుండగులు ప్రవేశించి హుండీని పగులగొట్టి అందులో ఉన్న నగదును అపహరించారు. హుండీ పగుల గొట్టే సమయంలో దొంగలకు రక్త గాయాలయినట్లుగా అక్కడ పడి ఉన్న రక్తం మరకల ద్వారా తెలుస్తోంది. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

బస్సులన్నీ కర్నూలు వైపే!



బస్సులు లేక ఖాళీగా ఉన్న ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్



ధర్మవరం బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ధర్మవరం: ప్రధాని నరేంద్రమోదీ గురువారం కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో ఆర్టీసీ బస్సులను అధికారులు ఇష్టారాజ్యంగా తరలించారు. జన సమీకరణలో భాగంగా బుధవారమే ఆర్టీసీ బస్సులను తరలించడంతో ప్రయాణికులు, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడ్డారు. జిల్లాలోని ఆర్టీసీ బస్టాండులన్నీ బస్సులు లేక బోసిపోయాయి. బస్సులు వస్తాయని ప్రయాణికులు గంటల కొద్ది వేచి చూశారు. చివరకు విషయం తెలుసుకుని అధికారులతో వాగ్వాదానికి దిగారు. ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. జిల్లాలోని అన్ని డిపోల నుంచి 250కు పైగా బస్సులను అధికారులు తరలించగా, ఇందులో ఒక్క ధర్మవరం డిపోకు చెందిన 51 బస్సులు ఉండడం గమనార్హం.

- **కొత్తచెరువు:** పుట్టపర్తి మండలం జగరాజుపల్లి సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్, మంగళకర విద్యా సంస్థలో చదువుకుంటున్న కొత్తచెరువు మండలానికి చెందిన విద్యార్థినులు దాదాపు వంద మంది బుధవారం బస్సులు లేక తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఈ నెల 16న కర్నూలులో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా బస్సులను ముందు రోజే తరలించడంతో ఈ సమస్య నెలకొంది. దీంతో పలువురు విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.



ధర్మవరంలోని కాలేజీ సర్కిల్‌లో బస్సుల కోసం విద్యార్థుల పడిగాపులు

టీచర్ల కొరత నివారించండి : ఎస్టీయూ



డీఈఓకు వినతి పత్రం సమర్పిస్తున్న ఎస్టీయూ నేతలు

పుట్టపర్తి: డీఎస్సీ–2025 ద్వారా ఎంపికైన నూతన ఉపాధ్యాయులను పట్టణ ప్రాంతాల్లో మాత్రమే నియమించారని, ఫలితంగా గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో టీచర్ల కొరత తీవ్రమైందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గజ్జల హరిప్రసాదరెడ్డి అన్నారు. వెంటనే గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో టీచర్ల కొరత నివారణకు సర్దుబాటు చర్యలు చేపట్టాలని డీఈఓ కృష్ణప్పను కోరారు. ఈ మేరకు బుధవారం డీఈఓను కలిసి వినతి పత్రం సమర్పించి, మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అనేక పాఠశాలలో టీచర్ల కొరత తీవ్రంగా ఉందన్నారు. కొత్త టీచర్ల నియామకం తర్వాత కూడా ఈ సమస్య అలాగే కొనసాగడం విచారకరమన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో సెకండ్ గ్రేడ్, లాంగ్వేజ్ పండిట్ల కొరత ఉందన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్ల కొరత ఉందన్నారు. గత సంవత్సరం 10వ తరగతి బోధించే ఉపాధ్యాయులు నూరు రోజుల కార్యక్రమంలో భాగంగా సెలవు దినాల్లోనూ పనిచేయాల్సి వచ్చిందన్నారు. వారికి లీప్ యాప్‌లో సీసీఎల్ ఇన్సర్ట్ చేసి వినియోగించుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. 10వ తరగతి మూల్యాంకనం విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు టీఏ, డీఏ జమ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు వెంకటేశ్వర్లు, కొత్తచెరువు మండల శాఖ అధ్యక్షుడు శివయ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీ కొన్న లారీ

- ఏడుగురికి గాయాలు

బత్తలపల్లి: ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ఏడుగురు భవన నిర్మాణ కార్మికులు గాయపడ్డారు. వివరాలు.. బత్తలపల్లిలోని వడ్డెర కాలనీకి చెందిన పలువురు వడ్డెర్లు బుధవారం ధర్మవరంలో బేల్దారి పనులు ముగించుకుని ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. బత్తలపల్లి సమీపంలోని ధాబా వద్దకు చేరుకోగానే ధర్మవరం వైపు నుంచి వస్తున్న లారీ వెనుక నుంచి ఢీ కొనడంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న హనుమంతు, రామాంజనేయులు, అరుణ్‌కుమార్, పెద్దన్న అలియాస్ సూరప్ప, రమాదేవి, వెంకటరాముడు, ఓబులేసు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న బత్తలపల్లి వాసులు అక్కడికి చేరుకుని ఆటోను పైకెత్తి క్షతగాత్రులను మరో ఆటోలో స్థానిక ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ బత్తలపల్లి మండల మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, నాయకులు ఈడిగ కాశప్ప, ప్రసాద్, సీపీఐ నాయకులు వడ్డె సన్నపెద్దన్న, రజియా తదితరులు క్షతగాత్రులను పరామర్శించారు.

కాలువలో వ్యక్తి మృతదేహం



హంద్రీనీవా కాలువ నీటిలో తేలుతున్న మృతదేహం

కనగానపల్లి: ఆత్మకూరు మండలం పంపనూరు సమీపంలో హంద్రీ–నీవా కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం కనగానపల్లి మండలం బాలేపాళ్యం సమీపంలో కాలువలో బయటపడింది. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ మండలం కురుగుంటకు చెందిన నాగభూషణ (65) రెండు రోజుల క్రితం పంపనూరు వద్ద హంద్రీనీవా కాలువలో ఈత కొడుతూ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. దీంతో గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు కాలువ వెంబడి పరిశీలిస్తూ ముందుకు సాగారు. బాలేపాళ్యం సమీపంలో హంద్రీనీవా కాలువలో బుధవారం కనిపించిన మృతదేహాన్ని వెలికితీశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.



శ్రీవారికి లక్ష పుష్పార్చన

హిందూపురం: పట్టణంలోని పేట వేంకటరమణ స్వామి ఆలయంలో బుధవారం పుష్యమి నక్షత్రం సందర్భంగా మూలవిరాట్‌కు లక్ష పుష్పార్చన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం భేష్

- జర్మనీ ప్రతినిధుల బృందం కితాబు



జీవ, ఘనా మృతం తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న అధికారులు, జర్మన్ బృందం

పుట్టపర్తి అర్బన్: తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడించే ప్రకృతి వ్యవసాయం అద్భుతంగా ఉందని జర్మనీ ప్రతినిధుల బృందం కితాబునిచ్చింది. బుధవారం చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, కలెక్టర్ శ్యాం ప్రసాద్, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో కలిసి జర్మన్ అంబాసిడర్ డాక్టర్ ఫిలిప్ అక్రిమన్, హైదరాబాద్ కౌన్సిల్ జనరల్ అమిత దేశాయ్, సీనియర్ సెక్టార్ స్పెషలిస్ట్ సంగీత అగర్వాల్, ప్రకృతి వ్యవసాయం సీనియర్ అడ్వైజర్‌లు మురళీధర్, వరప్రసాద్, వైఎస్సార్ కడప, పులివెందులకు చెందిన అధికారులు పుట్టపర్తి మండలం పెడపల్లి, పెద్దతండాల్లో పర్యటించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులతో ముచ్చటించారు. పెడపల్లి పెద్ద తండాకు చెందిన రైతు ఆంజనేయులు నాయక్ పొలంలో జీవామృతం, ఘనామృతం తయారీ విధానాన్ని జర్మనీ బృందం సభ్యులు అడిగా తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయంతో రైతు విజయలక్ష్మి బాయి సాగు చేసిన వేరుశనగ, జొన్న, సజ్జ, చిక్కుడు, ఆముదం, మొక్కజొన్న, ఆకు కూరలు, పెసర, అలసంద పంటలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం షాజహాన్ పండిస్తున్న వరి మడిని పరిశీలించారు. ముఖ్యంగా చిరుధాన్యాల సాగుతో లాభాలు బాగున్నాయని తండా వాసులు వివరించారు. అనంతరం జర్మనీ బృందం సభ్యులు, అధికారులతో కలిసి చిరుధాన్యాలతో తయారు చేసిన భోజనాన్ని ఆరగించారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలు, నవధాన్యాల సాగు, జీవామృతం, ఘనామృతం, సీడ్ ట్రీట్‌మెంట్, భూమికి వేసే ఎరువులు, రోగాలు వచ్చే ముందు, వచ్చిన తర్వాత వినియోగించే మందుల పిచికారీ విధానాలను ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్ జర్మనీ బృందం సభ్యులకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, జిల్లా వ్యవసాయాధికారి రాము నాయక్, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, పశుసంవర్ధకశాఖ అధికారి శుభదాస్, తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి, ఏడీఏలు కృష్ణమీనన్, స్వయంప్రభ, ఏఓలు, ఇతర వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తమ్ముడా మజాకా

- మానసిక వికలాంగుల కేటగిరీలో పింఛన్
- టీఎన్‌టీయూసీ హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడు తాడాల నాగభూషణం నిర్వాకం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేటకు చెందిన తాడాల నాగభూషణం నాలుగు చక్రాల వాహనాల మెకానిక్‌గా పని చేస్తున్నాడు. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు గాయమైంది. దీన్ని ఆసరాగా చేసుకుని మానసిక వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ పొందాడు. అప్పట్లో వైద్యులపై ఒత్తిడి చేయించి ఈ సర్టిఫికెట్ పొందాడనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. అప్పటి నుంచి దాదాపు పదేళ్లుగా దివ్యాంగుల కోటాలో పింఛన్ పొందుతున్నాడు. తొలుత నెలకు రూ.1,500 వచ్చేది. ఆ తర్వాత రూ.3 వేలు, ఇప్పుడు రూ.6 వేలు వస్తోంది.



ఇదిగో ఈ ఫొటో బాగా పరిశీలించండి. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఇటీవల రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించిన 'ఆటోడ్రైవర్ సేవలో' కార్యక్రమం ప్రారంభించిన సందర్భంలో తీసిన ఫొటో ఇది. ఎమ్మెల్యే పక్కన ఉన్న వ్యక్తి (సర్కిల్‌లో) టీఎన్‌టీయూసీ (తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్) హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడు తాడాల నాగభూషణం. ఈయన మానసిక వ్యాధితో బాధపడుతున్నాడట! దివ్యాంగ కోటాలో (పింఛన్ ఐడీ 112723626) ప్రతినెలా రూ.6 వేల పింఛను తీసుకుంటున్నాడు. ఇటీవల జిల్లాలో దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారిలో 9,601 మందికి ప్రభుత్వం నోటీసులు ఇచ్చింది. వారందరూ మరోమారు వైద్యుల వద్ద వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆదేశించింది. వీరిలో చాలా మంది తీవ్ర వైకల్యంతో బాధపడుతున్నవారే. ఈ జాబితాలో టీఎన్‌టీయూసీ నేత తాడాల నాగభూషణం పేరు మాత్రం లేదు.

మానసిక రోగి...ఇంత యాక్టివ్ ఎలా?

ఈయన మానసిక రోగిగా ఉంటూ ఇంత యాక్టివ్‌గా ఎలా ఉంటున్నాడనేది ప్రశ్న. అంతే కాదు రాప్తాడు ఆటోనగర్ ప్రెసిడెంట్‌గానూ పని చేశాడు. ప్రస్తుతం గౌరవాధ్యక్షుడిగా ఉన్నాడు. తెలుగుదేశం పార్టీ అనుబంధంగా ఉన్న టీఎన్‌టీయూసీ పార్లమెంటు అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. నాగభూషణం అక్రమంగా పొందుతున్న పింఛన్‌పై గతంలోనూ పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. వందశాతం వైకల్యం కల్గిన అసలైన బాధితుల నోట్లో మట్టి కొట్టేందుకు సిద్ధమైన కూటమి సర్కారు.. తాడాల నాగభూషణం వంటి వారి విషయంలో మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది.